నామఫలకాలు కన్నడలో తప్పనిసరి

బెంగళూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కన్నడయే పాలనా భాషగా ఉంది. కన్నడకు మరింత ప్రాధాన్యతనిచ్చేలా కన్నడ భాషా సమగ్ర అభివృద్ధి చట్టానికి సవరణ చేశారు. ప్రభుత్వంలోని అన్నిశాఖల్లోనూ వాటి పరిధిలోని కమిషనరేట్, డైరెక్టరేట్, మండలి, బోర్డులు, ప్రాధికారకు పేరు, నామఫలకాలు, మార్గసూచికలు, ఇతర నామఫలకాలు తప్పనిసరిగా కన్నడలోనే ఉండాలని ఆదేశించారు. అనివార్యమైన పరిస్థితుల్లో మాత్రమే కన్నడ భాషకు 60శాతంతో పైభాగాన, 40శాతంతో ఆంగ్లంలో కింద ఉండేలా నమోదు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నమ్మకం కోల్పోయిన... క్లినిక్‌లు..!



- వెంటాడుతున్న వైద్యులు, నర్సులు, సిబ్బంది కొరత
- పేదలకు అందని వైద్యం
- నెరవేరని ప్రభుత్వ ఆశయం

బెంగళూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో సామాన్య ప్రజలకు వైద్య భారం తగ్గించాలని, నిరంతరం సేవలు అందుబాటులో ఉండాలని ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం విజయవంతంగా కొనసాగిస్తున్న 'మొహల్లా క్లినిక్'ల తరహాలోనే బెంగళూరు వ్యాప్తంగా పేదలకు 'నమ్మ క్లినిక్' పేరిట వైద్యం సరళీకృతం చేయాలని తలపెట్టిన కేంద్రాలు నామమాత్రంగా మిగిలిపోయాయి. ప్రాంతాలవారీగా ఏర్పాటు చేసిన నమ్మ క్లినిక్‌లలో డాక్టర్ల కొరత వేధిస్తోంది. కనీసం నర్సులు, సిబ్బంది సైతం లేకపోవడంతో ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. నగర పరిధిలోని 39 క్లినిక్‌లకు నెలల కాలంగా డాక్టర్లే లేరు. ప్రస్తుతం నగరవ్యాప్తంగా వార్డుకు ఒకటి చొప్పున 243 'నమ్మ క్లినిక్'లు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఒక డాక్టర్, ఒక నర్సు, ఒక ల్యాబ్ అసిస్టెంట్, డి గ్రూప్ ఉద్యోగి ఒకరిని నియమించారు. తక్కువ వేతనం, ఏడాదికి మాత్రమే కాంట్రాక్టు పద్ధతిన నియామకాలు తదితర కారణాలతో నమ్మ క్లినిక్‌లలో పనిచేసేందుకు వైద్యులు ఆసక్తి చూపడం లేదు. కేంద్రాలు ప్రారంభించి రెండేళ్లు కావస్తున్నా ఇప్పటికీ 39 క్లినిక్‌లకు వైద్యాధికారులే లేరనేది ఆరోగ్యశాఖ రికార్డుల ద్వారా తెలుస్తోంది. 2022 ఫిబ్రవరిలో అప్పటి బీజేపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించి 108 క్లినిక్‌లను ప్రారంభించింది. ఆ తర్వాత అంచెలంచెలుగా 243 కేంద్రాలకు విస్తరింపచేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30వరకు ఈ క్లినిక్‌లు పనిచేయాలి. జ్వరంతోపాటు సీజనల్ వ్యాధులు, బ్లడ్ షుగర్ వంటి పరీక్షలు చేస్తారు. క్లినిక్‌లలో డాక్టర్లు పనిచేసేందుకు ఆసక్తి చూపకపోవడంతో కేవలం నర్సులు మాత్రమే కొనసాగే పరిస్థితి ఉంది. బెంగళూరు దక్షిణ, తూర్పు డివిజన్‌లలో సమస్య తీవ్రంగా ఉంది. ఎంబీబీఎస్ డాక్టర్లను నియమించుకుంటున్నారు. నెలకు వారికి రూ.47,250 వేతనం చెల్లించేలా నిర్ణయించారు. కోర్సులు పూర్తి చేసిన వెంటనే యువ వైద్యులు నమ్మ క్లినిక్‌లో చేరేందుకు ఆసక్తి చూపారు. అందుకు పలు కారణాలు ఉన్నాయి. భిన్నమైన ఆరోగ్య సమస్యలతో వచ్చేవారికి పరీక్షలు, చికిత్సలు అందించడం ద్వారా అనుభవం వస్తుందని, మరోవైపు మహానగరంలో సామాన్యులకు వైద్య సేవలు అందించడం ద్వారా మానవీయ కోణంలో సంతృప్తి పొందవచ్చునని చేరారు. ఇక్కడి పరిస్థితుల్లో ఏమాత్రం అనుకూలంగా లేకపోవడంతో ఇతర ప్రాంతాకు వెళ్లడం లేదా ఉన్నతవిద్య అవకాశాలను వెదుక్కోవడం వంటి కారణాలతో ఏడాది పూర్తి కాకుండానే వదులుకుని వెళ్లిపోతున్నారు. తూర్పు డివిజన్‌లో మంజూరైన 12 పోస్టులకు గాను 10 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తెలుస్తోంది. వైద్యులు లేకుండా సేవలు కొనసాగించడం కష్టతరంగా మారుతోందని నర్సులు వాపోతున్నారు. అనుకున్న లక్ష్యం ప్రకారం సామాన్యులకు ఉత్తమ సేవలు అందించడం సాధ్యం కావడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జలుబు, జ్వరం, దగ్గు వంటి సమస్యలతో వచ్చేవారికి మాత్రలు ఇచ్చి పంపుతున్నామని ఓ నర్సు తెలిపారు. నమ్మ క్లినిక్‌లలో నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్‌ల కొరత కూడా వెంటాడుతోంది. 12 క్లినిక్‌లకు ల్యాబ్ టెక్నీషియన్‌లే లేరు. ఇక నర్సుల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. బీఎస్సీ నర్సింగ్, డిప్లమో చేసినవారికి నెలకు రూ.15,750 వేతనం చెల్లించేలా నిర్ణయించారు. ఇంత తక్కువ మొత్తానికి పనిచేయలేమని వదిలేసి వెళ్లిపోతున్నారు. చికిత్సలకు సంబంధించి 12 ఆరోగ్య సేవలకు ప్యాకేజీ ఉన్నాయి. గర్భిణీలకు అవగాహన కల్పించడం, నవజాత శిశువులకు ఆరోగ్యరక్షణ, జ్వరం, జలుబు, దగ్గు వంటి సాధారణ జబ్బులకు ఓపీడీ సేవలు కొనసాగిస్తారు. ఎంబీబీఎస్ పూర్తి చేసినవారు పీజీలో చేరేందుకు నీట్ పరీక్షలకు వెళ్లేందుకు ఖాళీగా ఉండడం ఎందుకని నమ్మ క్లినిక్‌లలో చేరినవారు ఎక్కువమంది ఉన్నట్టు తెలుస్తోంది. వారు కొన్ని నెలలకే వదిలేసుకుంటుడడంతో కొత్తవారిని నియమించుకోవడం కష్టతరంగా మారుతోంది. మరోవైపు నగరంలో వందలాది ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయి. వాటిలో నర్సులు, ల్యాబ్‌టెక్నీషియన్‌లకు నమ్మ క్లినిక్‌లలో చెల్లించే వేతనం కంటే రెట్టింపు వస్తోంది. దీంతో చాలా మంది అటువైపు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇలా పలు కారణాలతో నమ్మ క్లినిక్‌లలో సామాన్యులకు వైద్య సేవలు లేకుండా పోయాయి.

11 బిల్లులు... తిరస్కరణ..!

- ప్రభుత్వం, గవర్నర్ మధ్య పెరుగుతున్న అగాథం



బెంగళూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజ్‌భవన్ వర్సెస్ ప్రభుత్వం అనే పరిస్థితి కొనసాగుతోంది. ప్రభుత్వం పాలనా సౌలభ్యాలకు అనుగుణంగా వివిధ విభాగాలలో సవరణల బిల్లులను కేబినెట్ లేదా శాసనసభలో ఆమోదం తర్వాత రాజ్‌భవన్‌కు పంపడం సంప్రదాయం. కొన్నింటిపై గవర్నర్ అభ్యంతరాలు ఉంటే వాపసు పంపుతారు. ఇది సాధారణంగా జరిగే ప్రక్రియ. ఏకంగా 11 బిల్లులను గవర్నర్ తిప్పిపంపిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ సంవత్సరం జనవరి నుంచి 11 బిల్లులను తిరస్కరించగా కేవలం ఆగస్టులోనే 6 బిల్లులు రాజ్‌భవన్ నుంచి సర్కార్‌కు వెనక్కి వచ్చాయి. కర్ణాటక ప్రజా పరీక్ష (అవినీతి రహిత బిల్లు), కర్ణాటక ధార్మికదత్త (దేవదాయశాఖ), టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, ఎమ్మెల్యేల అనర్హత నియంత్రణ, పురసభలు, ఇతర విభాగాల న్యాయబిల్లు, చలనచిత్ర సాంస్కృతిక కళాకారుల సంక్షేమ బిల్లు, సహకార సంఘాల సవరణ బిల్లు, సౌహార్ద్ర సహకారి సవరణ బిల్లు, గదగ్ - బేటగేరి వ్యాపార, సంస్కృతి ప్రదర్శన ప్రాధికార బిల్లు, కర్ణాటక రిజిస్ట్రేషన్ సవరణ బిల్లు, రేణుకా ఎల్లమ్మ దేవాలయం అభివృద్ధి ప్రాధికార బిల్లులను గవర్నర్ తిరస్కరించారు. గవర్నర్ సదరు బిల్లులకు సంబంధించి సమగ్ర సమాచారం ఇవ్వాలని బిల్లులను వాపసు పంపారు.

వివరణ కోరి ఉంటే బాగుండేది : డీసీఎం

బిల్లులను తిప్పి పంపడానికి బదులు వాటిలో వేటికైనా వివరణ కోరి ఉంటే బదులిచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. బెంగళూరులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గవర్నర్ చర్యను తప్పుపట్టడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ చేతిలో కీలుబొమ్మగా వ్యవహరిస్తుంటే మాత్రం ప్రజాస్వామ్యానికి భంగం వాటిల్లినట్టే అన్నారు. మరో ప్రశ్నకు బదులిస్తూ గవర్నర్ రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్టు పేర్కొన్నారు.





ప్లానెటోరియంలో వివిధ నమూనాలను ఆసక్తిగా వీక్షిస్తున్న మంత్రి భోసరాజు, విద్యార్థులు

విద్యార్థుల్లో శాస్త్రీయ భావాలు పెంచాలి

- శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి భోసరాజు

బెంగళూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యార్థుల్లో శాస్త్రీయ మనోభావాలు పెంచేలా పలు పథకాలు అమలు చేయనున్నట్టు శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి భోసరాజు తెలిపారు. నేషనల్ స్పేస్ డేలో భాగంగా శుక్రవారం నగరంలోని జవహర్‌లాల్ నెహ్రూ ప్లానెటోరియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఆదిత్య ఎల్1 ఉపగ్రహ ప్రతిరూపం ఆకట్టుకునేలా ఉంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారత శాస్త్ర సాంకేతిక రంగాన్ని ప్రపంచానికి చాటేలా నేషనల్ స్పేస్‌డేను అర్థవంతంగా ఆచరించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో ఆధ్వర్యంలో వందకుపైగా ఉపగ్రహాలను ప్రయోగించారని, చంద్రయాన్ 1, 2, 3 ద్వారా అంతరిక్షరంగంలో భారతదేశం తనదైను గుర్తింపు సాధించిందని అన్నారు. రాష్ట్రంలోని 833 రెసిడెన్షియల్ పాఠశాలల్లో టెలిస్కోప్ సదుపాయం కల్పించనున్నట్టు తెలిపారు. తద్వారా విద్యార్థుల ప్రయోగానికి వీలు కానుందని అన్నారు. సూర్యుడిపై అధ్యయనానికి తరలుతున్న ఆదిత్య ఎల్1 ఉపగ్రహ ప్రతిరూపం ప్లానెటోరియంలో ఆకట్టుకుందన్నారు. కార్యక్రమంలో శివాజినగర్ ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్, బెంగళూరు అసోసియేషన్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ టీకే అలెక్స్, ప్లానెటోరియం డైరెక్టర్ డాక్టర్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న వినాయకులు

- సింగిల్ విండో ద్వారా చవితి వేడుకలకు అనుమతి
- బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్

బెంగళూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మరో రెండు వారాల్లో వినాయక చవితి వేడుకలు వస్తున్నాయి. నగర పరిధిలో వేలాది ప్రాంతాల్లో వినాయకుడిని ప్రతిష్ఠించి పూజలు చేసే సంప్రదాయం కొనసాగుతోంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో వినాయకుడి విగ్రహాలు విక్రయాలకు సిద్ధం చేస్తున్నారు. ప్రధానంగా మావళ్లి రోడ్డు, మడివాళ, మాగడి రోడ్డు, యలహంక, మారతహళ్లి, జేపీ నగర్, జయనగర్‌తోపాటు సుమారు వంద ప్రాంతాల్లో విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. గతంలో రుద్రాక్ష గణపతి, క్రికెటర్ గణపతులు బాగా పేరొందాయి. ఈ ఏడాది బెంగళూరుతోపాటు రాష్ట్రమంతటా భారీ వర్షాలు కురిసి ప్రాజెక్టులు కళకళలాడుతుండడంతో అందుకు అనుగుణంగానే చవితి వేడుకలు ఉత్సాహంగా సాగనున్నాయి. బెంగళూరు మహానగర పాలికెలో 63 సబ్ డివిజన్ కార్యాలయాల్లో సింగిల్ విండో విధానంతో గణపతుల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తామని బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ తెలిపారు. శాంతిభద్రతలు కాపాడేదిశగా పాలికె, పోలీసు శాఖలు సమన్వయంగా వ్యవహరిస్తాయన్నారు. 63 సబ్ డివిజన్ కార్యాలయాల్లో బీబీఎంపీ, పోలీసు, బెస్కాం, అగ్నిమాపకశాఖలు సమన్వయంతో సింగిల్ విండో విధానంలో ఇస్తామని తెలిపారు. ప్రతి సబ్ డివిజన్ కార్యాలయంలోనూ నాలుగుశాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, వినతి ఇచ్చిన వెంటనే సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారని వివరించారు. మండపాల వద్ద ఫ్లెక్సీలు, బ్యానర్ల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అన్నారు. వినాయక చవితి రోజునే ఇళ్లల్లో ప్రతిష్ఠించే గణపతులను అదే రోజు నిమజ్జనం చేస్తారు. అందుకు చెరువులు, మొబైల్ ట్యాంకర్లను ఏర్పాటు చేయనున్నట్టు కమిషనర్ తెలిపారు. వినాయకుడిని ప్రతిష్ఠ చేసేవారు ఎక్కడ నిమజ్జనం చేస్తామనేది ముందుగా తెలపాల్సి ఉంటుందని, ఎలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయనేది కూడా వినతిలో కోరాల్సి ఉంటుందన్నారు. పీఓపీ గణపతులను పూర్తిగా నిషేధించినట్టు తెలిపారు. ఊరేగింపు జరిపే వేళ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సహకరించాలని సూచించారు. నిమజ్జనం వేళ పోలీసు సిబ్బంది ఉంటారని, మట్టి గణపతులను మాత్రమే ప్రతిష్ఠ చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు.



విక్రయానికి సిద్ధంగా వినాయకుడి విగ్రహాలు

ఆర్‌టీ నగర్ ఆర్‌ఎన్‌ఆర్‌కు అపూర్వ ఆదరణ

బెంగళూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెలుగు రుచులతో రాణిస్తున్న ఆర్ఎన్ఆర్ బ్రాండ్ హోటల్ ఆర్‌టీ నగర్‌లో అపూర్వ ఆదరణ సాధిస్తోందని డైరెక్టర్లు శ్వేతా రవి, రమ్య రవి వెల్లడించారు. ఆర్‌టీనగర్ శాఖ తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హోటల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మీడియాతో మాట్లాడుతూ ఆర్ఎన్ఆర్ బ్రాండ్ ఒక ఆశయంతో ఏర్పాటు చేశామన్నారు. నాలుగైదు దశాబ్దాల కిందటి నాటి స్టైల్‌లో వంటకాలను నేటి యువతకు పరిచయం చేయాలని బ్రాండ్‌ను తీసుకొచ్చామని వివరించారు. మునగకాయల చిల్లీ గ్రేవీ తొలిసారి ఆర్ఎన్ఆర్ ద్వారా ప్రారంభించామన్నారు. నాటి స్టైల్ బోన్‌లెస్ చికెన్ బిరియాని తమ ప్రత్యేకత అన్నారు. శాకాహారంలో నాటి పన్నీర్, మష్రూమ్ బిరియాని స్పెషాలిటీగా ఉందన్నారు. ఆర్‌టీ నగర్ శాఖకు తెలుగు, కన్నడ, తమిళవాసులతోపాటు ఉత్తరభారత్‌కు చెందినవారు వస్తుంటారని అన్నారు. జయనగర్ శాఖ రెండున్నరేళ్లు పూర్తి చేసుకుందన్నారు. నగర వ్యాప్తంగా ఆర్ఎన్ఆర్‌కు 20 కౌంటర్లు ఉన్నాయన్నారు.



నెక్సా శాఖ ప్రారంభంలో సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, సిబ్బంది

నెక్సా 500వ శాఖ ప్రారంభం

బెంగళూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మారుతి సుజుకి కార్లకు సంబంధించి రాష్ట్రంలో కల్యాణి మోటార్స్ సంస్థ అతిపెద్ద డీలర్‌షిప్‌గా ఉంది. మారుతి సుజుకి ప్రీమియం బ్రాండ్ కార్లలో 'నెక్సా'కు ప్రముఖ గుర్తింపు ఉంది. సంస్థకు దేశంలో 500వ అవుట్‌లెట్‌ను నగరంలోని నాసగంద్రలో శుక్రవారం లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు (మార్కెటింగ్ అండ్ సేల్స్) నోబుటాక సుజుకి, పార్థో బెనర్జీ పాల్గొన్నారు.

ఇస్రో పరిశోధనలు విశ్వానికే ఆదర్శం

- రేవా వేడుకల్లో పద్మశ్రీ డాక్టర్ మైల్‌స్వామి అన్నాదురై

బెంగళూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో శాస్త్రవేత్తల సాధనలు విశ్వానికే ఆదర్శమని ఇస్రో మాజీ శాస్త్రవేత్త, పద్మశ్రీ గ్రహీత డాక్టర్ మైల్‌స్వామి అన్నాదురై పేర్కొన్నారు. రేవా యూనివర్సిటీలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. ముఖ్యులుగా పాల్గొన్న అన్నాదురై విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఇస్రో ద్వారా చేసిన ప్రయోగాలు జాతికి ఎన్నో విధాలా మేలు చేస్తున్నాయని, చంద్రయాన్‌లో అడుగు పెట్టడం ద్వారా మరో అరుదైన మైలురాయికి ఏడాది ముగిసిందన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలు గత కొన్నేళ్లుగా వివిధ ప్రాంతాల ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులను అనుసంధానం చేసుకుంటున్నారని, ఇది మంచి పరిణామం అన్నారు. ఇది ప్రయోగాలు చేసేందుకు తగిన సమయమన్నారు. రేవా వంటి విద్యాసంస్థలు మల్టి డిసిప్లనరీ విధానాలు అవలంబించడం ద్వారా ఇంజనీరింగ్ ప్రతిభా ప్రాధాన్యతను ముందుగా గుర్తించినట్టు అవుతోందన్నారు. విద్యార్థులు ఆధునిక సమాజానికి అవసరమైన పరిశోధనల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రేవా యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ పి.శ్యామరాజు మాట్లాడుతూ మల్టి డిసిప్లినరీ విభాగాలలో సమగ్ర అవగాహన యువ విద్యార్థులకు కలిగేలాంటి వాతావరణం తీసుకొచ్చామన్నారు. రేవా నిరంతరం గుణాత్మకతకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రేవాలో కేవలం అకడమిక్‌గానే కాకుండా భవిష్యత్ తరాలకు అవసరమైన ఆకాంక్షలను పరిష్కారం చేసే పరిశోధనలకు విద్యార్థుల ద్వారా ప్రోత్సహిస్తున్నామన్నారు. తాను విద్యార్థులతో కలసి మూన్ మిషన్ ప్రారంభించాలని కలలు కంటున్నానన్నారు. రాకెట్లను తయారు చేసేలా విద్యార్థులను తీర్చిదిద్దుతాన్నారు. కార్యక్రమంలో వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఎన్. రమేశ్, ప్రో-చాన్స్‌లర్ డాక్టర్ శుభ, డాక్టర్ సంజయ్ ఆర్ చట్నీస్, డాక్టర్ కేఎస్ నారాయణస్వామి, డాక్టర్ ఆర్‌సీ బిరాదార్ పాల్గొన్నారు. అనంతరం 'ఇండియాస్ నెక్స్ ఫ్రాంటీయర్ ఇన్నోవేషన్స్ ఇన్ స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్స్' అనే అంశంపై చర్చాగోష్ఠి జరిగింది. ఇస్రో మాజీ శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేశ్వరన్, ఇండియన్ నేవీ రిటైర్డు అధికారి జయకృష్ణన్ ఎన్ నాయర్, డిఫెన్స్ అండ్ రీసెర్చ్ అండ్ స్టడీస్ ఫౌండర్ సీఈఓ డాక్టర్ వి.కేశవరాజు, మార్స్ ఆర్బిటర్ మిషన్ ఇస్రో మాజీ డైరెక్టర్ డాక్టర్ వినోద్ ఎస్ చిప్పలకట్టి, డాక్టర్ సుదీంద్ర తీర్థ కౌశిక్, రేవా జియో పాలిటిక్స్ ఇంటర్నేషనల్ స్టడీస్ హెచ్ఓడీ విజయ్ సక్కుజా తదితరులు పాల్గొన్నారు.



జాతీయ అంతరిక్ష దినోత్సవంలో పద్మశ్రీ డాక్టర్ మైల్‌స్వామి అన్నాదురై, రేవా చాన్స్‌లర్ డాక్టర్ పి.శ్యామరాజు



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1627.01	1,626.23
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	37,489	1,606
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9488	10,244
సామర్థ్యం (టీఎంసీలు)	83.25	82.63

26న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

బళ్లారి సిటీ, ఆగస్టు 23: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని కప్పగల్ రోడ్డులోని ఇస్కాన్ టెంపుల్లో సోమవారం ఉదయం 9గంటల నుండి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధి ఈశ్వరపురదాస్ హరేకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు భగవద్గీత శ్లోకపఠనం, కృష్ణ వేషధారణ వేదక్విజ్, శాస్త్రీయ నృత్యం తదితర పోటీల్లో పాల్గొననున్నారు. సాయంత్రం 6గంటల నుంచి 7.30గంటల వరకు శ్రీ రాధాకృష్ణులకు మహాభిషేకం, ఊయలసేవ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్వామివారి లీలల గురించి గురువుల ప్రవచనం ఉంటుంది. అనంతరం విచ్చేసిన భక్తాదులందరికి ప్రసాద వితరణ జరుగుతుంది. భక్తాదులందరూ ఈకార్యక్రమంలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

గొల్లల సంఘం ఆధ్వర్యంలో ...

బళ్లారిరూరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా సోమవారం బళ్లారి నగర మహానగరపాలిక ఆవరణ నుంచి శ్రీ భగవాన్ శ్రీకృష్ణ చిత్రపటాన్ని ఊరేగించనున్నారు. మహానగర పాలిక నుంచి రాయల్ సర్కిల్, మోతి సర్కిల్, జోళదరాసి దొడ్డనగౌడ, రంగమందిరం వరకు ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బళ్లారి జిల్లా గొల్లల సంఘం అధ్యక్షుడు గాదెప్ప, ప్రధాన కార్యదర్శి నాగరాజు తెలిపారు.

జికా వైరస్‌పై అవగాహన కల్పించాలి




ప్రమాణం చేస్తున్న డీహెచ్‌ఓ రమేశ్‌బాబు

బళ్లారి సిటీ, ఆగస్టు 23: జికా అనేది డెంగ్యూ, చికున్‌గున్యాను వ్యాపింపచేసే ఏడీస్ దోమల ద్వారా సంక్రమించే వైరల్ ఇన్‌ఫెక్షన్ అని డీహెచ్‌ఓ రమేశ్‌బాబు తెలిపారు. జిల్లాఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ దోమల దినోత్సవంలో భాగంగా ఆయన మాట్లాడారు. వినియోగానికి నీళ్లతో నింపే డ్రమ్ము, పీపా, సిమెంట్ ట్యాంక్ తదితర వాటిని వారానికోసారి శుభ్రం చేసి, నీళ్ళు నింపిన తరువాత సరిగ్గా మూసివేసి, వ్యాధులు రాకుండా చూడాలన్నారు. దోమల వచ్చే మలేరియా, మెదడువాపు, ఎలిఫెంటియాసిస్, డెంగ్యూ, చికిన్‌గున్యా, ఇటీవల కనగొనబడిన జికా వైరస్‌పై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా కమ్యూనికబుల్ డిసీజ్ కంట్రోల్ అధికారి డా.అబ్దుల్లా మాట్లాడుతూ జికా వైరస్ ఏడీస్ దోమలు కుట్టడం ద్వారా వ్యాపించే వ్యాధి అని సాధారణంగా ఏడీస్‌దోమలు పగటిపూట కుడతాయన్నారు. జికా వైరస్ కేసు నమోదైన ప్రాంతానికి వెళ్ళిన వారిలో ఎవరికైనా జ్వరం, కళ్లు ఎర్రబడడం వంటి జికా వైరస్ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆసుపత్రికి వెళ్లాలన్నారు. తలనొప్పి, కీళ్లనొప్పులు, కండరాల నొప్పి 2నుండి 7రోజుల వరకుఉంటాయన్నారు. ఈ లక్షణాలు ఉన్నవారు సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అవసరమైన చికిత్స పొందాలన్నారు. ఈసందర్భంగా కుటుంబ సంక్షేమ అధికారిణి పూర్ణిమ కట్టిమణి, క్షయ నిర్మూలన అధికారిణి ఇంద్రాణి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం వద్దు

కంప్లి, ఆగస్టు 23: ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని కంప్లి పురసభ ముఖ్య అధికారి దుర్గన్న కోరారు. ప్లాస్టిక్ ఆరోగ్యంపై చెడుప్రభావం చూపుతుందన్నారు. పాత బస్టాండు వద్ద శుక్రవారం స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై ఒక పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు, షాపుల యజమానులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దీనికి సహకరించాలన్నారు. దీని వల్ల భూమిలో భూగర్భజలాలు కనుమరుగవుతున్నాయన్నారు. అలాగే పొలాల్లో కూడా సరియైన పంటలు లేక రైతన్నలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

దేవలాపురం పరవళ్లు



హెచ్చెల్సీలోకి దూకుతున్న దేవలాపురం పర్వతధార

కంప్లి, ఆగస్టు 23 : గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దేవలాపురం కొండల నుంచి జలపాతం గలగలా కిందకు దుముకుతోంది. ఈ దృశ్యం అక్కడ జనాన్ని పూర్తిగా ఆకట్టుకుంటోంది. భారీగా కొండల్లో నుంచి హెచ్చెల్సీ కాలువలోకి పరుగులు తీస్తున్న ఈ జలపాతాన్ని వీక్షిస్తూ జేఎస్ డబ్ల్యూ సిబ్బంది ఆనందాన్ని వ్యక్తపరుస్తున్నారు.

నారిహళ్ల రిజర్వాయర్ ఫుల్



నీటితో తొణికిసలాడుతున్న నారిహళ్ల చెరువు

బళ్లారి సిటీ, తోరణగల్లు, ఆగస్టు 23: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తోరణగల్లు సమీపంలోని నారహళ్ల కెరె (చెరువు)జలాలతో కళకళలాడుతోంది. సండూరు తాలూకా తారానగర్ గ్రామంలోని ఈ జలాశయం 31మీటర్ల ఎత్తు ఉండగా, ప్రస్తుతం రిజర్వాయర్‌లో 0.85టీఎంసీల నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్‌లో నీటి ప్రవాహం అంతకంతకూ పెరుగుతుండటంతో గురువారం రాత్రి 700 క్యూసెక్కుల నీటిని కాలువకు విడుదల చేశామని సంబంధిత అధికారి రెడ్డి తెలిపారు.

సంప్రదాయాలపై అవగాహన



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న కరిసిద్దేశ్వర శివాచార్య

కంప్లి, ఆగస్టు 23: ప్రతి ఒక్కరికీ దేశ సంప్రదాయాలపై అవగాహన ఎంతో అవసరమని బుక్కసాగర కరిసిద్దేశ్వర మఠాధీశ్వరులు విశ్వారాధ్య శివాచార్యులు తెలిపారు. కంప్లి పట్టణంలో నూతనంగా నిర్మించిన పేట బసవేశ్వరస్వామి భవనాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి ఒక్కరికీ అనుగుణంగా వుండే ఈ భవనం ఏర్పాటు ఎంతో అవసరమన్నారు. వీరశైవ సమాజ ప్రముఖులు ఇలాంటి ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు చేయడానికి ముందుకు రావడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. అనంతరం కల్లుడి బసవరాజు సమాజసేవను గుర్తించి అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో విద్యాశంకర్, అరివి బసవనగౌడ, వాలి కొట్రప్ప, కల్లుడి విశ్వనాథ్, మూకయ్య స్వామి, ఎస్ఎం నాగరాజు, అధ్యక్షులు వీరప్ప, సతీష్, మన్నూరు శరణప్ప, హేమయ్య స్వామి, శశిధర్ శాస్త్రి, చంద్రశేఖర్ గౌడ, గంగాధర, బసవరాజు, రాజేష్, వీరశైవ సమాజం పదాధికారులు అధ్యక్షులు వీరప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెలుగువారి సహజసంపద అవధానం

●ముగిసిన మహాశతావధానం ● సహస్రావధాని వద్దిపర్తి, భరతశర్మకు సన్మానం ● భారీగా తరలివచ్చిన తెలుగువారు



పృచ్ఛకులను సన్మానిస్తున్న సచ్చిదానంద సరస్వతి



సహస్రావధాని వద్దిపర్తి పద్మాకర్‌తో తెలుగువారు

బళ్లారి సిటీ,ఆగస్టు 23: తెలుగు సాహిత్య రంగంలో అతిఎక్కువ ప్రాచుర్యంపొందిన ప్రక్రియ అవధానమని స్వయంప్రకాశ సచ్చిదానందసరస్వతి స్వామి పేర్కొన్నారు. చాతుర్మాస్య సేవాసమితి ఆధ్వర్యంలో నగరంలోని బాలాంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన మహాసహస్రావధాని వద్దిపర్తి పద్మాకర్, అవధాన బాలభాస్కర్ భరత్‌శర్మల యుగళ మహా శతావధాన కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి సహజసంపద అవధాన ప్రక్రియ అన్నారు. అవధాని వద్దిపర్తి అవధానాన్ని అలవోకగా సరళసుందరంగా నిర్వహించారు. సాహితీ వేత్తలు, పండితులు, పృచ్ఛకులు ఎంతో పొడవైన సమస్యలు, దత్తపదులు అడుగగా ఏమాత్రం తడుముకోకుండా చక్కని పద్యాలతో రాగయుక్తంగా వాటికి తనదైన శైలిలో బదులిచ్చారు. అప్రస్తుత ప్రసంగంలో చమత్కారంతో శ్రోతలను ఆనందపరిచారు. ఆశువులు, వర్ణనలను కమ్మని పద్యాలతో ఆలపించారు. బాల అవధాని ఉప్పలదడియం భరత్‌శర్మ గురువుకు తగ్గ శిష్యుడుగా చిన్నవయసులోనే తన ప్రతిభా నైపుణ్యాన్ని చాటుకున్నారు. జంటకవులు అవధాన పద్యాలు చెబుతుంటే ప్రేక్షకులు, సాహితీవేత్తలు తన్మయత్వం చెందారు.

మూడు రోజులపాటు జరిగిన ఈ యుగళ శతావధానంలో చివరిరోజు శుక్రవారం 27 నిమిషాలలో 75 పద్యాలను అవధానులు ధారణచేసి ఆహూతులను అబ్బురపరిచారు. మొత్తంమీద బాలబాలికలకు తెలుగు మహత్తును చూపే గమ్మత్తులా అవధానం సాగింది. నగరంలోని తెలుగువారు భారీగా హాజరయిన ఈ కార్యక్రమంలో బాలాంజనేయస్వామి మఠం గురువు బాలానందస్వామి, సమితి సంచాలకురాలు రాజేశ్వరమ్మ, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పృచ్ఛకులు సత్యనారాయణ, మారుతీ, సురేశ్‌బాబు, మహేశ్‌శర్మ, సుధాకర్, లక్ష్మీనారాయణ, వెంకటేశులు, మాధవరాజు, సురేంద్రబాబు, చంద్రమౌళి, వెంకమాంబ దేవన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరాలమ్మదేవి కుంభ మహోత్సవం



వరాలమ్మదేవికి కుంభ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

సిరుగుప్ప, ఆగస్టు 23: సిరుగుప్ప పట్టణంలోని ఆదోని రోడ్డు మార్గంలో ప్రవాసాంధ్రులు వుండే విజయనగర కాలనీలో వరాలమ్మదేవి కుంభమహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ప్రతి శ్రావణ శుక్రవారం వరాలమ్మదేవికి తుంగభద్ర నది నుంచి ఆలయం వరకు కుంభ మహోత్సవం మేళతాళాలతో నిర్వహించారు. భక్తులు దేవికి మొక్కుబడులు చెల్లించి ఆశీర్వాదాలు పొందారు.

పంచాయతీల్లో లోకాయుక్త సోదాలు



చేళగుర్కి పంచాయతీ కార్యాలయంలోకి వెళుతున్న లోకాయుక్త అధికారులు

బళ్లారిరూరల్, ఆగస్టు 23 :తాలుకాలోని పీడీ హళ్లి, చేళగుర్కి, అమలాపురం తదితర గ్రామ పంచాయతీలలో శుక్రవారం ఉదయం ఉప్పల్ విజయనగరం, రాయచూర్, బళ్లారి లోకాయుక్త అధికారులు, బళ్లారి లోకాయుక్త ఎస్పీ సిద్దరాజు ఆధ్వర్యంలో సోదాలు చేపట్టారు. 14 గ్రామ పంచాయతీలలో 2022-23సంవత్సరానికి పదిహేనవ ఫైనాన్స్ నిధులలో అవకతవకలకు సంబంధించి పలు ఫైళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వసంత్‌కుమార్, సీఐ రఫీక్ పలు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మెగాస్టార్ జన్మదిన వేడుకలు



విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న చిరు అభిమానులు

సిరుగుప్ప, ఆగస్టు 23: మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని అభిమానులు హైస్కూలు విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అదేవిధంగా ఆస్పత్రి రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెగా అభిమానుల సంఘం అధ్యక్షులు మూర్తి మాట్లాడుతూ చిరంజీవికి 69 యేళ్లు వచ్చినా తన నట విశ్వరూపంతో ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటున్నారని ఆనందం వ్యక్తం చేశారు.

బస్సు సౌకర్యంలేక విద్యార్థుల అవస్థలు

కంప్లి, ఆగస్టు 23 :నియోజకవర్గంలోని కురుగోడు నుంచి కంప్లికి బస్సుసౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సిటీలో తిరిగే డొక్కు బస్సులను ఇక్కడ నడుపుతున్నారు. ఆ బస్సులు ఎక్కడపడితే అక్కడ నిలిచిపోయి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. విద్యార్థులు సరియైన బస్సు సౌకర్యాలు లేక ఆటోలు, ద్విచక్రవాహనాలు ఇతర వాటిపై వారి ప్రయాణం కొనసాగిస్తున్నారు. ఎన్నోసార్లు ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంతంగా కురేకుప్ప అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు



అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన వారితో ఎంపీ తుకారామ్

తోరణగల్లు, ఆగస్టు 23: కురేకుప్ప పురసభకు శుక్రవారం జరిగిన అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి కళుగూడప్ప, జ్యోతి నారాయణ ఎన్నికయ్యారు. బీజేపీ, జేడీఎస్ పార్టీల తరపున వసిగిరి లక్ష్మీ అధ్యక్షురాలుగా, ఉపాధ్యక్షురాలుగా ప్రేమ పోటీచేశారు. కాంగ్రెస్ అభ్యర్థి కళుగూడప్పకు పది ఓట్లు రాగా ఉపాధ్యక్షురాలిగా పోటీ చేసిన జ్యోతి నారాయణకు పది ఓట్లు వచ్చాయి. బీజేపీ, జేడీఎస్ పార్టీ తరపున అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా పోటీ చేసిన వాసిగిరి లక్ష్మీకి, ప్రేమకు ఒకొక్కరికి తొమ్మిది ఓట్లు పోలయ్యాయి. దీంతో ఎన్నికల అధికారి తహసీల్దార్ అనిల్‌కుమార్ అధ్యక్షుడిగా కళుగూడప్పను, ఉపాధ్యక్షురాలిగా జ్యోతి నారాయణను ఎనికయినట్లుగా ప్రకటించారు. అలాగే ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు ఈ తుకారామ్ పాల్గొన్నారు. ఆయన గెలిచిన వారికి అందుకు సహకరించిన వారికి అందరికీ అభినందనలు తెలియజేశారు. పురసభ ముఖ్య అధికారి బీజేపీ ప్రముఖులు జేడీఎస్ ప్రముఖులు కాంగ్రెస్ ప్రముఖులు, పురసభ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లారీ యజమానుల ధర్నా

బళ్లారిరూరల్, ఆగస్టు 23: బళ్లారి తాలుకా సిడిగినమల గ్రామ సమీపంలో గల జానకి ఏ వన్ స్టీల్ ఫ్యాక్టరీ సమీపంలో లారీ అసోసియేషన్ అధ్యక్షులు మించు శ్రీనివాస్ నేతృత్వంలో లారీ ఓనర్లు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఐరన్‌ఓర్ సరుకు రవాణా ధరలు పెంచాలంటూ వారు డిమాండ్ చేస్తున్నారు. ఈసందర్భంగా ధర్నాలో పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక లారీ ఓనర్లకు సరైన సరుకు రవాణా చార్జీలు ఇవ్వాలనే డిమాండ్‌తో బళ్లారి నగరంలోని వివిధ ఫ్యాక్టరీల వద్ద ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. తమ డిమాండ్లు నెరవేరేంతవరకు ధర్నా కొనసాగిస్తామని లారీ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు తెలిపారు. కార్పొరేటర్లు ప్రభంజన్ కుమార్, బీఆర్‌ఎల్ శ్రీనివాస్ పలువురు లారీ ఓనర్లు పాల్గొన్నారు.



జానకి ఫ్యాక్టరీ వద్ద ధర్నా చేస్తున్న లారీ యజమానులు

హోసూరు జోన్

రైతుల నుంచి 194 ఫిర్యాదులు



సమావేశంలో పాల్గొన్న అధికారులు, రైతులు

హోసూరు(కృష్ణగిరి) ఆగస్టు 23: కృష్ణగిరి జిల్లాలో రైతుల సమస్యలను నేరుగా విని వాటిని పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన రైతు ఫిర్యాదుల పరిష్కార దినోత్సవ సమావేశంలో రైతుల నుంచి 194 వినతిపత్రాలు అందాయి. సమావేశంల్లో వ్యవసాయానికి సంబంధించిన సాధారణ సమస్యలపై చర్చించారు. అలాగే కొత్త రకాల మామిడి మొక్కలకు పూర్తి రాయితీ ఇవ్వాలని రైతులు కోరారు. ఉద్యాన కళాశాల, కేవీకే పరిశోధనా సంస్థ పియూర్ ద్వారా రైతులకు మామిడి నిర్వహణపై శిక్షణ, కౌలు మార్పు భూమి ఆక్రమణ, విద్యుత్ కనెక్షన్లు, నీటి సరఫరా నిర్వహణ, రోడ్డు సౌకర్యం, రెవిన్యూ శాఖ పత్రాలు, ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తాగునీటి సౌకర్యం, వ్యవసాయానికి సంబంధించిన శిక్షణ, బ్యాంకు సూడాన్, ప్రభుత్వ అన్యాక్రాంతమైన భూములు, బస్సు సౌకర్యం, రోడ్డు ఆక్రమణల తొలగింపు, సరస్సుల పూడికతీత తదితర డిమాండ్లను రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రైతుల డిమాండ్లపై జిల్లా రెవెన్యూ అధికారి స్పందిస్తూ రైతుల డిమాండ్లన్నింటినీ వెంటనే ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామని, సంబంధిత శాఖాధికారులు పరిశీలించి చర్యలు తీసుకుంటారని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ సంయుక్త సంచాలకుడు పచ్చయ్యప్పన్, జిల్లా కలెక్టర్ ఇంటర్వ్యూ అసిస్టెంట్ కె.రాజమోహన్, జిల్లా కలెక్టర్ ఇంటర్వ్యూ అసిస్టెంట్ సుందరరాజ్, శాఖాధికారులు, రైతులు పాల్గొన్నారు.

శానమావు అటవీ ప్రాంతంలో ఒంటరి ఏనుగు సంచారం



రోడ్డు దాటుతున్న ఒంటరి ఏనుగు

హోసూరు ఆగస్టు 23: బెంగళూరు-హోసూరు సమీపంలోని శానుమావు అటవీ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. గతంలో శూలగిరి అడవుల్లో ఇబ్బంది పెట్టిన ఓ ఏనుగు శుక్రవారం సాయంత్రం మళ్లీ ఆ ప్రాంతానికి వచ్చి బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిని దాటేందుకు ప్రయత్నించింది. దీనిపై సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు గోపసంద్రం సమీపంలో జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాలను నిలిపివేశారు. గోపసంద్రం దగ్గర అటవీప్రాంతానికి వచ్చిన ఆ ఒంటరి ఏనుగు రోడ్డు నెమ్మదిగా దాటింది. అనంతరం అటవీ ప్రాంత పోలీసులు వాహనాలను నిదానంగా నడపాలని చెప్పడంతో వాహనాలు నెమ్మదిగా కదిలాయి. దీంతో జాతీయ రహదారికి ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. శానమావు రామాపురం, అలియాళం, బీర్జేపల్లితోపాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాధికారులు విజ్ఞప్తి చేసుకున్నారు.

లబ్ధిదారులకు ఔషధాల పంపిణీ

హోసూరు(కృష్ణగిరి) ఆగస్టు 23: తమిళనాడు ప్రభుత్వం రూపొందించిన కమ్యూనిటీ ఆధారిత వైద్య కార్యక్రమంలో భాగంగా ఫీల్డ్ వర్కర్ల ద్వారా లబ్దిదారుల ఇళ్ల వద్దనే వైద్య సేవలు అందిస్తున్నారు. 45 ఏళ్ల అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారికి మందులు అందించడం, అధిక రక్తపోటు, మధుమేహం ఇతర వ్యాధులకు చికిత్స చేయడం, వ్యాధి సహాయక సేవలు, సాధారణ వైద్య సేవలు, కిడ్నీ రోగుల సంరక్షణ, తదితర వైద్యసేవలను సూచించడం చేస్తున్నారు. పిల్లలు, మహిళల్లో గర్భాశయ రొమ్ము క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పర్యవేక్షణ కోసం ఒక కుటుంబానికి అవసరమైన అన్ని ఆరోగ్య సేవలను ఇంటివద్దనే సేవలు అందిస్తున్నారు.

భార్య, అవ్వను చంపిన ఉద్యోగి



నిందితుడు దుర్గప్ప(ఫైల్)

రాయచూరు, ఆగస్టు 23: కుటుంబ కలహాల నేపథ్యంలో డి గ్రూప్ ఉద్యోగిగా పని చేస్తున్న దుర్గప్ప కట్టుకున్న భార్యను అవ్వను హతమార్చిన ఉదంతం ఇది. గత కొంతకాలంగా తాగుడు వ్యసనానికి బానిసైన దుర్గప్ప(34) తాగొచ్చి భార్య జ్యోతి(23), అవ్వ ద్యామమ్మ(66)లతో గొడవపడేవాడని స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో గురువారం రాత్రి వారిద్దరు హత్యకు గురి కావడంతో ఈ పని దుర్గప్పనే చేసి ఉంటాడని ఇరుగు పొరుగు వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న లింగసుగూరు తాలూకా ముదగల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి లింగసుగూరు తాలూకా ముదగల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అన్నను హతమార్చిన తమ్ముళ్లు

● ఆస్తి తగాదా న్యాయస్థానంలో ఉండగానే ఘోరం

రాయచూరు, ఆగస్టు 23:మాన్వి తాలూకా కుర్ది గ్రామానికి చెందిన సంజయ్ కుర్దికర్(38)ను ఆయన స్వంత తమ్ముళ్లే హతమార్చారు. ఈ సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకోగా శుక్రవారం విషయం బయటికి పొక్కింది. ముగ్గురు అన్నాదమ్ముల మధ్య పిత్రార్జితానికి సంబంధించిన ఆస్తి తగాదా ఉండడంతోనే ఈ ఘాతుకం జరిగినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో బయలుపడింది. సంఘటనాస్థలాన్ని పరిశీలించిన మాన్విపోలీసులు కేసు నమోదు చేశారు. ఆస్తితగాదానికి సంబంధించిన కేసు న్యాయస్థానంలో ఉండగానే అన్నపై నడిబజారులో తమ్ముళ్లు అతడిని హత్యచేయడం సంచలనంగా మారింది. నిందితులు సంజీవ్, సంఘర్షలను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు. వీరికి సహకరించిన మరో ఆరుగురు పరారీలో ఉన్నట్లు మాన్వి పోలీసులు తెలిపారు.

బీర సాగులో అధిక దిగుబడులు



హోసూరు(సిఫ్‌కాట్) ఆగస్టు 23: హోసూరు ప్రాంతంలో రైతులు బీర సాగు చేస్తున్నారు. ఈ సారి దిగుబడి భారీగా రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇది నాటిన 70 రోజుల తర్వాత కాపుకొస్తుంది. ఒక ఎకరం బీర సాగుకు ఎకరాకు సుమారు రూ.60 నుంచి రూ.70 వేలు ఖర్చు అవుతుంది. ఈ పరిస్థితిలో ప్రస్తుతం వ్యాపారులు రైతుల నుంచి బీరకాయ బాక్స్ రూ.400 నుంచి రూ.500 వరకు కొనుగోలు చేస్తున్నారు. రైతు నాగరాజ్ మాట్లాడుతూ, ఈ దర వలన రైతులకు ఏ మాత్రం లాభం లేదని తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంబ్...

ఆర్‌జీ భండార్కర్ (వర్ధంతి)




'సర్' రామకృష్ణ గోపాల్ (ఆర్‌జీ) భండార్కర్ 1837 జూలై 6న మహారాష్ట్రలోని సింధుదుర్గ జిల్లా మాల్వాన్‌లో జన్మించారు. విద్యావేత్త, సంఘ సంస్కర్త. ఆంగ్ల సాహిత్యంలోనూ, చరిత్ర, సంస్కృతంలో పరిశోధనలు చేశారు. బాంబే యూనివర్సిటీ తొలి డిగ్రీ బ్యాచ్ 1862లో ఒకరు. మాస్టర్ డిగ్రీ, పీహెచ్‌డీని జర్మనీలోని గొట్టిన్‌జెన్ యూనివర్సిటీ నుంచి అందుకున్నారు. ఆరు దశాబ్దాలపాటు మహారాష్ట్రలో సమాజంలో సంస్కరణలకు కృషి చేశారు. 'కౌన్సిల్ ఆఫ్ ఇండియా'కు 1903లో అనధికారిక సభ్యుడిగా ఎన్నికయ్యారు. అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం నుంచి 'కంపానియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది ఇండియన్ ఎంపైర్' పురస్కారం అందుకున్నారు. 1925 ఆగస్టు 24న కన్నుమూశారు.

అరుణ్ జైట్లీ (వర్ధంతి)



అరుణ్‌జైట్లీ 1952 డిసెంబరు 28న ఢిల్లీలో జన్మించారు. సుప్రీంకోర్టులో న్యాయవాదిగా వ్యవహరించిన ఆయన రాజకీయాల్లోనూ రాణించారు. ప్రధాని వీపీ సింగ్ హయాంలో అడిషినల్ సొలిసిటర్ జనరల్‌గా వ్యవహరించారు. బీజేపీ ద్వారా రాజ్యసభలో 2009 నుంచి 2014 వరకు ప్రతిపక్షనేతగా, అనంతరం కేంద్ర విదేశీ వ్యవహారాలు, డిఫెన్స్, ఆర్థికశాఖ మంత్రిగా కీలకహోదాలలో కొనసాగారు. ప్రధాని నరేంద్రమోదీ కేబినెట్‌లో జీఎస్టీ, డిమానిటైజేషన్, రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్‌లో విలీనం చేయడం వంటి ప్రముఖ నిర్ణయాల్లో ఆయన కీలకంగా వ్యవహరించారు. 2019 ఆగస్టు 24న కన్నుమూశారు. మరణానంతరం 'పద్మ విభూషణ్' ప్రకటించారు.

పండిట్ బసవరాజ్ రాజ్‌గురు (జయంతి)



'పద్మభూషణ్' పురస్కార గ్రహీత పండిట్ బసవరాజ్ రాజ్‌గురు 1920 ఆగస్టు 24న కర్ణాటక రాష్ట్రం ధారవాడ జిల్లా ఎలివాళ గ్రామంలో జన్మించారు. సంగీతం లోని కిరానా ఘరానా శైలి ఆలాపనలో పేరొందారు. విజయనగర సామ్రాజ్య 600వ వార్షికోత్సవంలో హంపిలో గురువు పంచాక్షర గవాయ్‌తో కలసి తొలి కచేరీ ప్రదర్శించారు. శాస్త్రీయ సంగీతం, ఖ్యాల్, వచన, నాట్యగీత్, తుమ్రి, గజల్‌లలోనూ ప్రతిభ చాటుకున్నారు. సంగీత నాటక అకాడమీ, పద్మ శ్రీ, పద్మభూషణ్ పురస్కారాలు, గౌరవ డాక్టరేట్ తదితర అవార్డులు పొందారు. 1991 జూలై 20న కన్నుమూశారు.

అంజలీదేవి (జయంతి)



అభినవ సీతమ్మగా పేరొందిన అంజలీదేవి 1927 ఆగస్టు 24న తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురంలో జన్మించారు. తెలుగు సినీ నటి, నిర్మాత. అసలుపేరు అంజనీ కుమారి. నర్తకి అయిన ఆమె రంగస్థలంలో జీవితాన్ని ప్రారంభించారు. సినీ ప్రస్థానంలో దర్శకుడు పుల్లయ్య ఆమె పేరును 'అంజలీ దేవి' గా మార్పు చేశారు. 'లవకుశ'లో ఎన్టీ రామారావు సరసన సీత పాత్రలో నటించి ఆ పాత్రకే వన్నె తెచ్చారు. సుమారు 500 తెలుగు, తమిళ, కన్నడ సినిమాల్లో నటించారు. 27 సినిమాలు నిర్మించారు. ఆమె భర్త పి నారాయణరావు సంగీత దర్శకుడు. ఉత్తమ నటి గా ఫిలింఫేర్ అవార్డులు, రఘుపతి వెంకయ్య పురస్కారం, ఏఎన్‌ఆర్ జాతీయ పురస్కారం తదితర గౌరవాలు అందుకున్నారు. 2014 జనవరి 13న కన్నుమూశారు.

నగరంలో కృష్ణాష్టమికి సన్నాహాలు

బెంగళూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం వచ్చిందంటే చాలు పండుగల సందడి నెలకొంటుంది. వరమహాలక్ష్మి, రక్షాబంధన్ వేడుకలు ముగియగా ప్రస్తుతం కృష్ణాష్టమి రానుంది. పురాణాల ప్రకారం శ్రీకృష్ణుడు జన్మించిన రోజును కృష్ణాష్టమిగా ఆచరిస్తారు. ప్రధానంగా శ్రీకృష్ణ ఆలయాలలో ప్రత్యేక పూజలు, గోవర్ధనగిరి ఏర్పాటు వంటి వాటితోపాటు కొన్ని చోట్ల చిన్నికృష్ణుడి అలంకరణలు, పోటీగా రాధా అలంకరణ పోటీలు నిర్వహిస్తారు. ఇందులో ప్రధానంగా నెమలిపించను ధరించిన చిన్నికృష్ణుడి రూపాలతో కొలువుదీర్చి పూజలు చేయడం సామాన్యంగా ఉంటుంది. ప్రత్యేకించి అలంకరణ విశేషంగా ఉంటుంది. నగరంలోని ప్రముఖ కూడళ్లు, మార్కెట్‌లలో చిన్నికృష్ణుడి బొమ్మల విక్రయాలు జోరందుకున్నాయి. ప్రత్యేకించి నగరంలోని ఇస్కాన్‌లో ఆది, సోమవారాలలో ప్రత్యేక పూజలు ఉంటాయని నిర్వాహకులు ప్రకటించారు.



కేఆర్‌పురం ప్రాంతంలో శ్రీకృష్ణుడి విగ్రహాల విక్రయాలు

రూ.15.5 కోట్లతో అభివృద్ధి పనులు

హొసకోటె, ఆగస్టు 23: హొసకోటె పట్టణంలో ముఖ్యమంత్రి ప్రత్యేక గ్రాంటుకింద సుమారు 15.5 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ శుక్రవారం భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బైపాస్ రూపొందించే ఉద్దేశ్యంతో అమాని దొడ్డకెరె నుంచి మరవపారే వద్ద సుమారు 4 కోట్ల రూపాయలతో బ్రిడ్జ్ నిర్మాణం చేయదలిచామన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా విద్యార్థినులకు పింక్ శౌచాలయాన్ని హొసకోటె ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో ప్రారంభించామని ఇక్కడ ఆటోమేటిక్ ఇండియన్, వెస్ట్రన్ కమోడ్, శ్యానిటరీ ప్యాడ్ వెండింగ్ యంత్రం, శ్యానిటరీ ప్యాడ్ బర్నింగ్ యంత్రం, విద్యార్థినులకు విశ్రాంతి గది, దివ్యాంగులకు ర్యాంప్, ప్రత్యేక శౌచాలయ వ్యవస్థ ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు బీవీ బైరేగౌడ, సదానంద్, విజికుమార్, ఎల్‌ఎన్‌టి మంజునాథ్, సుబ్బణ్ణ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ

ఆధునిక చికిత్సలు సామాన్యులకు అందుబాటులో ఉండాలి



రోబోటిక్స్ విభాగం ప్రారంభంలో ఎన్నికల కమిషనర్ మనోజ్‌కుమార్ మీనా తదితరులు

» ఎన్నికల కమిషనర్ మనోజ్‌కుమార్ మీనా

బెంగళూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం అన్నిరంగాలలోను అందుబాటులోకి వచ్చినట్లుగానే వైద్యరంగంలోను సాధ్యమైందని అత్యాధునిక చికిత్సలు సామాన్యులకు అందుబాటులో ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మనోజ్‌కుమార్ మీనా అభిప్రాయపడ్డారు. శుక్రవారం నగరంలోని కావేరి ఆసుపత్రిలో మోకాలి చిప్పల అమరిక కోసం అధునాతన రోబోటిక్స్ సాంకేతిక విభాగాన్ని లాంఛనంగా ఆరంభించారు. ఇదే సందర్భంగా మనోజ్‌కుమార్ మీనా మాట్లాడుతూ వైద్యరంగంలో కృత్రిమ మేధస్సు, రోబోటిక్ వంటి అభివృద్ధి ఆశాజనకమన్నారు. ఇటీవల కాలంలో వైద్యసేవలు సాధారణంతో పాటు సరళీకృతంగా మారడం ఆశాజనకమని అది సామాన్యులకు అందుబాటులో ఉంటే మరింత మేలు అన్నారు. కావేరీ ఆసుపత్రుల ఎండీ విజయభాస్కర్, ఆర్థోపెడిక్ ముఖ్యులు రఘునాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

బెంగళూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మన దేశ సంస్కృతి, ఆచార వ్యవహారాలను భావితరాలకు అందచేయాల్సిన బాధ్యత మనపై ఉందని పీఈఎస్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ శైలశ్రీ హరిదాస్ అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీలో శుక్రవారం విరించి 2024 పేరిట మహాభారతంలోని ఘట్టాలను తెలియచెప్పే కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులు అని భావి సమాజం కోసం మనం ఉన్నతమైన విలువలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠాలకే పరిమితం కాకుండా గొప్ప సమాజం నిర్మాణం కావాలంటే నైతిక విలువలు మనం పాటించి పిల్లలకు తెలియచేయాల్సిన అవసరం ఉందన్నారు. వసుధైక కుటుంబం అనేది మన నినాదమన్నారు. విరించి కార్యక్రమానికి 250కుపైగా విద్యాసంస్థల నుంచి విద్యార్థులు 30కుపైగా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పీఈఎస్ విద్యాసంస్థల డైరెక్టర్ ప్రొఫెసర్ ఎంవి సత్యనారాయణ తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.



విరించి కార్యక్రమం ప్రారంభంలో డీన్ డాక్టర్ శైలశ్రీ హరిదాస్ తదితరులు

నిరంతర ప్రయత్నాలతో గెలుపు సాధ్యం



తరగతుల ప్రారంభంలో ప్రముఖులు

దొమ్మసంద్ర, ఆగస్టు 23: విద్యార్థులు నిరంతర అభ్యాసం చేయడం ద్వారా గెలుపు సాధ్యమని, ప్రతి విద్యార్థి సాధనవైపు దృష్టి సారించాలని రామకృష్ణ ఆశ్రమ స్వామి అభయానంద మహరాజ్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని ఐఎస్‌బీఆర్ విద్యాసంస్థల డిగ్రీ, లా తరగతులను గురువారం లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యార్థి జీవితంలో డిగ్రీకి ఎంతో ప్రాముఖ్యం ఉందన్నారు. విద్యతోపాటు సంస్కారాన్ని పెంచుకోవాలన్నారు. గురువులకు గౌరవం, చదివిన పాఠశాల, కళాశాలకు కీర్తి తెచ్చేలా వ్యవహరించాలన్నారు. వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుకోవాలన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇ.ఎస్.ఇంద్రేశ్ మాట్లాడుతూ లా విద్యార్థులు క్రియాశీలకంగా ఉండాలన్నారు. మారుతున్న చట్టాలగురించి ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. పుట్టినప్పటి నుంచి మరణించే వరకు చట్టాల అవసరం ఉందన్నారు. ఐఎస్‌బీఆర్ గ్రూప్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ మనీష్ కొఠారియా, ఐఐఎస్‌సి వీరణ్ణ కమ్మార్, ఐఐఐటీబి ప్రాధాప్యకులు డాక్టర్ రమేశ్ కుమార్, యునెక్ట్ సంస్థ పూనమ్ నమజోషి, పాలకమండలి తపన్ నాయక్, బల్వంత్ కళస్కర్, లక్ష్మీనారాయణ్, నరసయ్య, లోకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

బంగారపేట, ఆగస్టు 23: పట్టణంలోని దేశిహళ్ళిలో పెండింగ్‌లో ఉన్న వివిధ పనులు అభివృద్ధి చేపట్టాలని పురసభ సభ్యురాలు సౌందర్యప్రభాకర్ రావ్ కోరారు. పురసభ కార్యాలయంలో నూతన అధ్యక్షుడు గోవింద, ఉపాధ్యక్షుడు చంద్రవేణి మంజునాథ్‌లకు దేశిహళ్ళి పురసభ్యులు, స్థానికులు శుక్రవారం పుష్పగుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇదే సందర్భంగా స్థానిక సమస్యలపై వినతిని అందజేశారు. కొన్ని నెలలుగా అధ్యక్ష, ఉపాధ్యక్షులు లేక పలు అభివృద్ధి పనులు అలాగే ఉన్నాయని, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని కోరారు. 24, 25 వార్డులలో నీటి సమస్య ఉందని నూతన అధ్యక్షులు పరిశీలించి పరిష్కరించాలని కోరారు. కొన్ని చోట్ల రోడ్డు, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని పైప్‌లైన్ లేక వర్షపునీరు సజావుగా ప్రవహించడం లేదన్నారు. కర్ణాటక క్షత్రియ మరాఠా పరిషత్ తాలూకా అధ్యక్షుడు చంద్రశేఖర్, పురసభ మాజీ నామినేటెడ్ సభ్యులు దేశిహళ్ళి శ్రీనివాస్, మహబూబ్, ప్రముఖులు ఆదినారాయణ, దళిత నాయకులు నవీన్‌కుమార్, మునిరాజు, ఎస్‌డీఎంసీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రాన్ని అందచేస్తున్న సభ్యురాలు సౌందర్య తదితరులు

వ్యవసాయ విద్యార్థులకు ప్రత్యేక శిబిరం


శిడ్లఘట్ట, ఆగస్టు 23: తాలూకాలోని బసవపట్టణలో చింతామణి పట్టు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఫైనలియర్ విద్యార్థులకు ప్రత్యేక శిబిరం నిర్వహించారు. కళాశాల ప్రాధ్యాపకుడు డాక్టర్ సురేశ్ మాట్లాడుతూ మూడు నెలలపాటు విద్యార్థులు బసవాపట్టణలోనే బసవ చేస్తారన్నారు. నవంబరు రెండో వారం వరకు ఉంటారని రైతులు ఎలాంటి పంటలు పండిస్తారో సర్వే చేసి సాగులో సాంకేతిక విధానాలపై రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. అలాగే విశ్వవిద్యాలయం రూపొందించిన పలు కొత్త వంగడాలను ఇక్కడ ప్రయోగిస్తారన్నారు. సేంద్రీయ సాగును ప్రోత్సహిస్తారన్నారు. కళాశాల వ్యవసాయ శాస్త్రవేత్తలు నిరంతరంగా గ్రామాన్ని సందర్శిస్తూ రైతులకు, విద్యార్థులకు మార్గదర్శకం చేస్తారన్నారు. రైతులకు మూడేళ్ల పాటు నేర్పించిన పాఠాల సారాన్ని మూడు నెలల్లో ప్రయోగాత్మకంగా నేర్చుకునే అవకాశం శిబిరంలో వీలు ఉంటుందన్నారు. పశువుల నిర్వహణ, చికిత్సలపై అవగాహన పెంచుతారన్నారు. కళాశాల సహ ప్రాధ్యాపకుడు డాక్టర్ టి. నరేశ్, డాక్టర్ నవీన్, పల్లవి, రమ్యాశ్రీ, మళమాచనహళ్ళి గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి శైలజా, హొసపేటె పీడీఓ యమునారాణి, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



బసవ పట్టణలో గ్రామీణ కృషి శిబిరంలో విద్యార్థులు

రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య

చింతామణి, ఆగస్టు 23: చిక్కబళ్ళాపుర నుంచి చింతామణి మార్గంలో కోలారుకు వెళ్లే రైలు పట్టణంలోని నెక్కుంది రైల్వేస్టేషన్ సమీపాన ట్రాక్‌పై వృద్ధుడు ఒకరు పడుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. చింతామణి పట్టణంలోని అంజని లే అవుట్ నివాసి ప్రముఖ వ్యాపారి ఎస్‌ఎన్ పాండురంగయ్యశెట్టి (80) మృతుడిగా గుర్తించారు. స్థానికంగా ఆయన పోస్ట్ పాండుగా చిరపరిచితులు. పట్టణంలోని గజానన సర్కిల్‌లో చిల్లర దుకాణం నిర్వహిస్తున్నారు. సదరు దుకాణాన్ని కుమారుడు మృతి అనంతరం మనవడికి అప్పగించారు. ఇటీవల జ్యువెలరీ దుకాణం ఏర్పాటు చేశారు. కొంతకాలంగా అనారోగ్యానికి గురయ్యాడు. తగిన శస్త్ర చికిత్సకోసం శుక్రవారం చేయించుకునేలా కోలారు ఆసుపత్రిలో నమోదు చేసుకున్నారు. రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవం అనంతరం గురువారం రాత్రి 9 గంటలైనా ఆయన కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. అయితే రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిచారు. మనవడు శశాంక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.




పోస్ట్‌పాండు (ఫైల్)

వీలింగ్‌తో పాదచారి మృతి

» పోకిరీలకు అడ్డుకట్ట వేయాలని స్థానికుల డిమాండ్

బంగారపేట, ఆగస్టు 23: పట్టణంలో వీలింగ్ చేసే వారి హవా పెరిగినా నియంత్రించడంలో పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని కోలారు మెయిన్‌రోడ్డు మార్గంలో రాత్రి సుమారు 8.30 గంటల వేళ గాంధీనగర్‌లోని గణేశ దేవాలయం నుంచి అర్చకుడు గోపాల్‌రావ్ (50) వాపసు వస్తున్నారు. విజయనగరలోని తమ ఇంటికి వెళ్తుండగా రోడ్డు దాటే సమయంలో వీలింగ్ చేస్తున్న కొందరు అతివేగంగా వచ్చి గోపాల్‌రావ్‌ను ఢీ కొన్నారు. తీవ్రంగా గాయపడిన గోపాల్‌రావ్‌ను గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం తలకు తీవ్రమైన గాయాలు కావడంతో కోలారులోని ఎస్‌ఎన్‌ఆర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి తీవ్రం కావడంతో బెంగళూరు నిమ్హాన్స్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే కన్నుమూశారు. ఘటనపై బంగారపేట పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా వీలింగ్‌కు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గోపాల్‌రావ్ (ఫైల్)

ఎంపీడీఓ అత్యుత్సాహం..!

గ్రామసభకు వైసీపీ నేత అధ్యక్షత

డీ.హీరేహాళ్, ఆగస్టు 23: మండలంలోని మలపనగుడిలో నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. గ్రామసభకు వైసీపీ మండల కన్వీనర్ ఎలా అధ్యక్షత వహిస్తారని టీడీపీ నాయకులు, ఎంపీడీఓ రఘుతో వాగ్వాదానికి దిగారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో ఉపాధిహామీ పథకానికి సంబంధించి గ్రామసభలు నిర్వహించారు. మలపనగుడి పంచాయతీలో కూడా ఆయా శాఖలకు సంబంధించిన అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామసభ వద్దకు వైసీపీ మండల కన్వీనర్ వన్నూరుస్వామి రాగానే ఎంపీడీఓ రఘునాథ్ ఆయనను ఆహ్వానించి సభా అధ్యక్షత వహించాలని కోరారు. దీనికి టీడీపీ నాయకులు అభ్యంతరం తెలిపారు. ఇదేమైనా వైసీపీకి సంబంధించిన సభ లేక ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామసభనా అని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులు మాత్రమే సభకు అధ్యక్షత వహించే విధంగా చర్యలు చేపట్టాలని తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వైసీపీ నాయకులకు, టీడీపీ నాయకులకు కాసేపు మాటల యుద్ధం జరిగింది. ఇది తీవ్రస్థాయికి చేరడంతో వైసీపీ మండల కన్వీనర్ వన్నూరుస్వామి గ్రామసభ నుంచి వెళ్లిపోయారు.

రేపు వేమన సాహిత్యయాత్ర

పెనుకొండ, ఆగస్టు 23: జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వేమన సాహితీయాత్ర నిర్వహిస్తామని జిల్లా రచయిత సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్ బాషా తెలిపారు. ఈ యాత్రలో వివిధ రాష్ట్రాల నుంచి 50మంది కవులు పాల్గొంటారన్నారు. ఈ సాహితీయాత్ర కదిరి నుంచి ప్రారంభమై వేమన సమాధి ఉన్న కటారుపల్లికి చేరుకుంటుందన్నారు. అక్కడ 25మంది కవులతో వేమన సాహితీవేదిక నిర్వహిస్తామన్నారు. తర్వాత తిమ్మమ్మ మర్రిమాను వద్దకు చేరుకుని మరో 20మంది కవులతో సమ్మేళనం నిర్వహిస్తామని వెల్లడించారు. అనంతరం కృష్ణదేవరాయల సన్మానసభలో 50మంది కవులకు ప్రశంసాపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర సాహితీ అకాడమీ గ్రహీత చదువులబాబు, ఆచార్య బాలసుబ్రహ్మణ్యం, తెలుగుభాష శాఖ అధ్యక్షులు, పురావస్తుశాఖ సహాయ సంచాలకులు రజిత హాజరవుతారన్నారు.

చీనీ టన్ను రూ.23వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 23: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.23వేలు, కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి రూ.15,500లతో అమ్ముడుపోయి నట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు 263 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

జీడిపల్లిలో 1.097 టీఎంసీల నిల్వ

బెళుగుప్ప, ఆగస్టు 23: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో నీటి నిల్వ శుక్రవారానికి 1.094 టీఎంసీలకు చేరినట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌కు 955 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు చెప్పారు.

ఆభరణాలంటే మక్కువ



గోల్డ్ ఫెస్టివల్‌లో నటి రచితారామ్ తదితరులు

బెంగళూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆభరణాలంటే మగువలకు మక్కువ అని ప్రముఖ కన్నడ నటి రచితారామ్ అభిప్రాయపడ్డారు. బెంగళూరు జ్యువెలర్స్ అసోసియేషన్ (జేఏబీ) ఆధ్వర్యంలో గోల్డ్ ఫెస్టివల్ మూడో ఎడిషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ప్రముఖ బ్రాండెడ్ సంస్థలు, కళాకారులు రూపొందించిన ఆభరణాలు ఇక్కడ ప్రదర్శించనున్నారని ఆమె తెలిపారు. జేఏబీ అధ్యక్షుడు డాక్టర్ చేతన్‌కుమార్ మెహతా మాట్లాడుతూ దసరా, దీపావళి పండుగలు కలిపి 45రోజుల పాటు ఫెస్టివల్ ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ సాయిగోల్డ్ ప్యాలెస్ అధ్యక్షుడు డాక్టర్ టీఏ శరవణ మాట్లాడుతూ రెండు ఎడిషన్‌లు విజయవంతం కావడంతో మూడో ఎడిషన్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఫెస్టివల్ అధ్యక్షుడు సురేశ్‌కుమార్ గన్నా తదితరులు పాల్గొన్నారు.

గణపతికి ప్రత్యేక పూజలు



ద్విముఖ గణపతికి విశేష అలంకరణ

శిడ్లఘట్ట, ఆగస్టు 23: పట్టణంలోని ద్విముఖ గణపతి ఆలయంలో సంకష్ట చతుర్థి విశేషపూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. గురువారం ఉదయం ఆలయ శుద్ధి, అభిషేకం, హారతి అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం సంకష్ట చతుర్థి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 8.30 వరకు ద్విముఖ గణపతి చరిత్రను ఆలయ పురోహితుడు కృష్ణమూర్తి సోదరులు భక్తులకు వివరించారు. వినాయకుడి లీలలను, తత్వాలను తెలియచేశారు. ధూపదీప నైవేద్యాలతో స్వామివారికి మహామంగళారతి అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. తదుపరి అన్నసంతర్పణ నిర్వహించారు. పట్టణంలోని పిలేచర్ కాలనీలోని గణపతి గాయత్రిదేవి, వెంకటేశ్వరస్వామి, శనిమహాత్మస్వామి ఆలయంలో కొలువైన గణపతి స్వామికి సంకష్టచతుర్థి పూజలు నిర్వహించారు. నగరేశ్వర ఆలయంలోనూ, వీరపురలోని వినాయకుడి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు.

26 వరకు ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తులు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 23: ఐటీఐ కళాశాల్లో ప్రవేశాలు కల్పించేందుకు ఈనెల 26వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వారి సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ పూర్తిచేసుకుని వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకున్న విద్యార్థులకు 29న ప్రభుత్వ, 31న ప్రైవేట్ కళాశాలలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.20

అనంతపురం రూరల్, ఆగస్టు 23: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠం గా రూ.25తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 3800 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.11, కనిష్ఠ ధర రూ.ఆరు పలికినట్లు ఆయన తెలిపారు.

మిద్దె కూలి నలుగురికి గాయాలు

ఉరవకొండ, ఆగస్టు23: మిద్దెకూలి నలుగురు గాయపడిన సంఘటన వజ్రకరూరు మండలంలోని బోడిసానిపల్లి గ్రామంలో జరిగింది. గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు మిద్దె బాగా నానడంతో కుప్పకూలిపోయింది. దీంతో ఇంట్లో ఉన్న భార్యభర్తలు రాజేష్, భాగ్యమ్మలతో పాటు వారి తల్లి పార్వతి, బంధువులైన వన్నూరుస్వామికి గాయాలు అయ్యాయి. వారు కేకలు వేయడంతో స్థానికులు గుర్తించి వారిని 108వాహనంలో గుంతకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా పక్క గదిలో ఉన్న రాజేష్, భాగ్యమ్మల కుమార్తెకు త్రుటిలో ప్రమాదం తప్పింది.